


# సమస్యలు - పరిష్కారాలు

## - డా.యండమూరి వీరేంద్రనాథ్



సమస్య రాగానే మనం పరిష్కారం ఆలోచించటం మానేసి, విచారించటం ప్రారంభిస్తాం.

సముద్రం ఎంత పెద్దదైనా, నీళ్ళని లోపలికి రానివ్వకపోతే పడవ మునగదు. సమస్య ఎంత పెద్దదైనా, మనసులోకి రానివ్వకపోతే బాధ ఉండదు.

పాతికశాతం సమస్యలు పరిష్కారం లేనివి. పరిష్కారం లేని ఈ పాతిక శాతం గురించీ మనం జీవితంలో సగభాగం ఆలోచిస్తూ గడిపేస్తాం. ఇంకో యాభై శాతం సమస్యలు మనకి ఇతరుల వల్ల వచ్చేవి. అవి తీరాలంటే మారవలసింది వాళ్ళు. మనం కాదు. తాగుబోతు భర్త, దుబారా భార్య, గయ్యాళి అత్తగారు, చెడుదార్లో సంతానం వగైరా. వాళ్ళని మార్చటం ఎలా అని నిరర్థకంగా విచారిస్తూ మరో పాతిక శాతం కాలం గడిపేస్తాం. మిగిలిన పాతిక శాతం సమస్యల్నుంచి బయటపడాలంటే కఠినమైన నిర్ణయాలు అమలు జరపాలి. దురదృష్టవశాత్తూ ఇటువంటి సందర్భాల్లో మనం ఆలోచిస్తూ కూర్చుంటాము తప్ప నిర్ణయాలు తీసుకోము. తీసుకున్నా, అమలు జరపం.

...

ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో, ఆ నిర్ణయాన్ని ఎలా అమలు జరపాలో, ఏ సమస్యకి ఎలాంటి నిర్ణయం తీసుకుంటే సమస్య తాలూకు సాంద్రత తగ్గుతుందో ఆత్మీయంగా చెప్పే పుస్తకం.

బొమ్మలు: డా. జయదేవ్

## ముందు మాట

**ఈ** పుస్తకంలోని చాలా ప్రశ్నలు నవ్య, సాక్షి మొదలైన పత్రికలలో ప్రచురింపబడినవి. కొన్ని ప్రశ్నలు, సభల్లో ఉపన్యాసం అనంతరం శ్రోతలు అడిగినవి, మరి కొన్ని మిత్రుల మధ్య జరిగిన సంభాషణలో దొర్లినవి. కేవలం రెండు ప్రశ్నలు మాత్రం సమాధానం ఇవ్వటం కోసం సృష్టింపబడినవి.

కొన్ని సమాధానాల్లో కొన్ని కొటేషన్లు, చిన్న చిన్న కథలు, సంఘటనలు, సందర్భాలబట్టి గతంలో వ్రాసిన పుస్తకాల నుంచి పునరుద్ధాటించబడినవి. వీలైనంత ఎక్కువ మంది పాఠకులకు విషయం చేరాలనే ఉదేశంతో వాటిల్ని తిరిగి ప్రస్తావించడం జరిగింది. వీటిని అంతకు ముందే చదివిన పాఠకులకు ఈ పునరుక్తి విషయమై క్షమాపణలు. ఇక్కడ, సమాధానాల కన్నా... ప్రశ్నలు ముఖ్యమని ఉద్దేశ్యం. ప్రస్తుతం యువత ఎలాంటి సమస్యలతో బాధపడుతోందన్న విషయం తెలియజెప్పటంకోసం, జవాబుల్ని పునరుక్తీకరించటం జరిగింది. అదే విధంగా, కాపీ రైట్ లేని ఇంటర్నెట్ బొమ్మలు కొన్ని వాడుకోవటం జరిగింది. ఆ అజ్ఞాత కళాకారులకి కృతజ్ఞతలు.

చివరిగా ఒక మాట.

ఈ ప్రపంచంలో ఏ ఇద్దరి అభిప్రాయాలూ ఒకలా ఉండవు. ఇందులోని కొన్ని అభిప్రాయాలు కొంతమందికి నచ్చకపోవచ్చు. మరి కొందరికి కడుపులో దేవినట్టుగా కూడా అనిపించవచ్చు. ముందే చెప్పినట్టు ఎవరి అభిప్రాయాలు వారివి. దీనికోసం వాదనలు, ప్రతివాదనలు అనవసరం. వాదించేటప్పుడు మనం అవతలి వారిని అర్థం చేసుకోవటానికి వినం. మనం గెలవటానికి వీలుగా జవాబు ప్రిపేర్ చేసుకుంటూ వింటాం. ఇద్దరు రెచ్చిపోయి దీర్ఘంగా వాదించుకుంటున్నారంటే, అందులో ఒకరు మూగ, మరొకరు చెవిటి.

మూగ వాడికి అందరూ చెవిటి వాళ్ళలాగా కనబడతారు. చెవిటి వాడికి ప్రపంచమంతా మూగగా ఉన్నట్టు అనిపిస్తుంది. అర్థం – పర్థం లేని వాదనల పరమార్థం ఇదే.

వాదనలో గెలవటానికి అత్యుత్తమ సాధనం చిరునవ్వు. ఇతరులతో వచ్చే చాలా సమస్యల్ని 'నవ్వు' పరిష్కరిస్తుంది. 'మౌనం' సమస్యల్ని రాకుండా చేస్తుంది.

–రచయిత.

**మోహన్, గుంటూరు.**

**మొన్న మా ఊళ్ళో సభలో తాపత్రయం గురించి కథ చెప్తూ, ఒక పుస్తకం గురించి చెప్పారు. మైకు సరిగ్గా లేక ఏమీ వినిపించలేదు. దాని పేరేమిటి? వివరించగలరు.**

ఆ పుస్తకం పేరు ***విజయానికి అయిదు మెట్లు***. ఏది ఎంత వరకూ కావాలో, ఏది ఎప్పుడు వదులుకోవాలో తెలుసుకోలేక... దేనిపట్లనైనా పెంచుకునే మితి మీరిన వ్యామోహమే తాపత్రయం. అ'నా'రోగ్యకరమైన ఎటాచ్‌మెంట్..! 'తాపం' అంటే కోరిక. 'త్రయం' అంటే మూడు. "నేను బావుండాలి. నన్ను బావుంచటం కోసం అవతలివారు బాధపడినా నేను బావుండాలి. నేను పోయిన తరువాత కూడా నా వాళ్ళు (మాత్రమే) బావుండాలి" అనే మూడు కోరికలే. విషాదాలకీ మూల కారణమైన తాపత్రయం.




ఈ 'తాపత్రయం' గురించి త్వరలో రాయబోయే రెండు కథల సారాంశాన్ని అక్కడ సభలో ప్రస్తావించాను. మొదటి కథలో ఒక రాజకీయనాయకుడు అవినీతి పద్ధతుల్లో కోట్లు సంపాదించి జైలు కెళ్తాడు. ఒక రోజు అకస్మాత్తుగా ఆరోగ్యం పాడైతే జైలు అధికారులు ఆసుపత్రిలో చేర్పిస్తారు. ఒక గంటలో అతడు నాటకీయంగా కోలుకుంటాడు. ఆ సమయంలో అతడికొక చిత్రమైన కోరిక కలుగుతుంది. తాను అకస్మాత్తుగా ఇంటికి వెళ్తే వాళ్ళు ఎలా రిసీవ్ చేసుకుంటారో చూడాలని అనిపిస్తుంది. జైలుకి వెళ్ళబోయే ముందు అదే అంబులెన్స్‌లో ఇంటికి వెళ్ళి తన వాళ్ళని చూడటానికి పోలీసు అధికారుల్ని అనుమతివ్వమంటాడు. పోలీసు అధికారి దయతో దాన్ని అనుమతిస్తాడు. వాళ్ళు వెళ్ళే సరికి అద్భుతంగా అలంకరింపబడిన ఇంటి బయటి లాన్స్‌లో అందరూ చాలా సంతోషంగా అతడి భార్య తమ్ముడి పుట్టిన రోజు వేడుకని పెద్ద ఎత్తున జరుపుకుంటూ ఉంటారు. ఆ యువ నాయకుడికి షాక్ తగిలినట్టు అవుతుంది. ఆత్మావలోకనం చేసుకుంటాడు. తను జైల్లో చిప్ప కూడు తింటున్నా, కటిక నేల మీద పడుకుంటున్నా ఇంట్లో వాళ్ళు తమ ఎయిర్ కండీషండ్ పడక సుఖాలు త్యాగం చెయ్యరని అర్థమవుతుంది. ఇంత తాపత్రయం అర్థరహితమని తెలుసుకుంటాడు. కథ నాటకీయంగా ఉన్నా చెప్పదల్చుకున్న భావం ముఖ్యం.

రెండో కథలో ఒక లంచగొండి గుమస్తా కూతురు ఇంటర్మీడియట్ పాసవుతుంది. ఆ సమయంలో మెడికల్ కోర్సు ప్రవేశ పరీక్ష పేపర్లు లభ్యమవుతున్నాయని తెలుస్తుంది. యాభై లక్షలు పెట్టి కొని కూతురితో పరీక్ష రాయిస్తాడు. ఆ అమ్మాయికి సెకెండ్ ర్యాంకు వస్తుంది. అందరూ చాలా సంతోషంగా ఉన్న సమయంలో పోలీసులు అతడిని, అతడి కూతుర్ని అరెస్ట్ చేస్తారు. అతడికి ఏడు సంవత్సరాలు, కూతురికి రెండు సంవత్సరాలు శిక్ష పడుతుంది. కూతురి జీవితం సర్వనాశనం అయిపోతుంది. ఏది మంచో, ఏది చెడో నిర్ణయించుకోగలిగే విచక్షణా జ్ఞానం లేని చిన్న పిల్ల, ఆ విధంగా తండ్రి తాలూకు అత్యాశకి బలైపోతుంది. తాచుపాములాంటి కోరిక తన పిల్లల్ని కూడా మింగేస్తుందని చెప్పటం ఇక్కడ కథాంశం.

**శర్మ:**

**మేం ఒక అగ్ర కులస్తులం. సమాజంలో మాకంటూ ఓ గుర్తింపు, గౌరవం ఉన్నాయి. కానీ నా కూతురు ఒక తక్కువ కులం కుర్రాడిని ప్రేమించింది. తననే పెళ్లి చేసుకుంటాను అంటోంది. అబ్బాయి మంచివాడు, బాగా చూసుకుంటాడు అని కచ్చితంగా చెప్పేస్తోంది. కానీ నాకది ఇష్టం లేదు. ఈ పెళ్లి వల్ల మా బంధువులు, స్నేహితుల మధ్య మా గౌరవం పోతుంది. అలాగే ఆ అబ్బాయి కుటుంబం, మా కుటుంబం ఎప్పటికీ కలవలేవు. రకరకాల స్పర్థలు వస్తాయి. తారతమ్యాలు కనిపిస్తాయి. కాబట్టి జీవితాంతం ఇబ్బందే. అందుకే వద్దంటున్నాను. కానీ నా కూతురు వినడం లేదు. ఇప్పుడు నేనేం చేయాలి? నేను అనుకున్నదే చేయాలా లేక తన జీవితం తన ఇష్టం అని పెళ్లికి ఒప్పుకోవాలా?**

మీ ప్రశ్న తాలూకు చివరి వాక్యాలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి."...నేను చేసుకోవద్దంటున్నాను. కాని నా కూతురు వినటం లేదు. నేనుకున్నదే చేయాలా? లేక పెళ్లికి ఒప్పుకోవాలా?" అని వ్రాసారు. మీరు ఏమనుకుంటున్నారు? 'పెళ్లి జరగటానికి వీల్లేదు' అనుకుంటున్నారు. అవునా? కాని మీ కూతురు వినటంలేదు. మరేం చేస్తుంది? ఇంట్లోంచి వెళ్లిపోయి ఆ అబ్బాయిని వివాహం చేసుకుంటుందా? లేక ఆజన్మ బ్రహ్మచారిణిగా ఉండిపోతుందా?

ఎలాగో మీ మాట విననన్నపుడు ఇక మీకు వేరే పరిష్కార మార్గం ఏముంది? లేదూ, మీరు ఎమోషనల్‌గా బలవంతం చేస్తే, ఆ కుర్రవాడిని మరచిపోయి మీరు చెప్పిన వివాహం చేసుకుంటుందనుకుందాం! ఆ అమ్మాయి మనస్తత్వం ఎలాంటిది? 'గతం గతః' అనుకుని భర్తతో సుఖంగా కాపురం చేయగలుగుతుందా, లేక డిప్రెషన్ కి గురై ఒక కుర్రవాడి(భర్త) జీవితం నాశనం చేసే మనస్తత్వమా? తండ్రిగా మీరే దాన్ని బాగా గుర్తించగలరు. మీ ప్రశ్నలో మరి కొన్ని వివరాలు ఇవ్వలేదు. అతడు ఉద్యోగం చేస్తున్నాడా? ఆ అబ్బాయి తల్లిదండ్రులు ఈ పెళ్లికి సుముఖంగా ఉన్నారా? లేదా పెద్దల నుండి దూరంగా వెళ్ళిపోయి విడిగా సంసారం పెట్టాలనే ఆలోచనలో ఉన్నాడా?

ఆ అబ్బాయి గురించి మీ అమ్మాయి, "చాలా మంచివాడు. బాగా చూసు కుంటాడు అంటుంది" అన్నారు. ప్రేమించిన కొత్తలో ప్రతివాళ్ళూ అలాగే అనుకుంటారు. కౌన్సిలింగ్ కి వచ్చే కేసుల్లో సగం పైగా ప్రేమ వివాహాలే! ఇవన్నీ మీ అమ్మాయికి చెప్పి చూడండి. దానికన్నా ముందు ఆ అబ్బాయిని కలుసుకుని ఒకసారి మాట్లాడండి. అతడి ఆర్థిక స్థాయి గురించి వివరాలు సేకరించండి. అన్నీ మీ అమ్మాయికి చెప్పండి. ఆ తర్వాత నిర్ణయం ఆమెకే వదిలిపెట్టండి. మీరన్నట్టుగా మీ కుటుంబం, ఆ అబ్బాయి కుటుంబం ఎప్పటికీ కలవక పోవచ్చు. వాళ్లిద్దరూ పరిస్థితులకి అనుగుణంగా అడ్జస్ట్ అయి సామరస్యంగా సంసారం చేసుకునే మనస్తత్వం ఉన్నవాళ్ళేనా? నిజంగా వాళ్లకి అలా సంసారం చేసుకునే స్థైర్యం, నిబద్ధత, సామర్థ్యం ఉంటే, మీరు మీ కుటుంబగౌరవం గురించి, మీ స్నేహితుల గురించి, ఏ మాత్రం బాధ పడవలసిన అవసరం లేదు. ఈ రోజుల్లో కులాంతర వివాహాల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. అలా కాకుండా, మీ కుటుంబంలో మిగతా వారి వివాహాలకు మీ అమ్మాయి తీసుకున్న నిర్ణయం అడ్డొస్తుందంటే, మీనుండి విడిపోవలసి వస్తుంది అని హెచ్చరించండి. చివరగా ఒక మాట..! మీ కులం కాని వారందరిదీ 'తక్కువ కులం' అనే అభిప్రాయం  మార్చుకోండి. మారే అభిప్రాయాల గురించి మరో జెన్ కథ వినండి.

'నాకు కాళ్ళు నొప్పిగా ఉన్నాయి. నిద్ర వస్తోంది. ఈ మెడిటేషనూ, యోగా వృధా అనిపిస్తోంది' అన్నాడట శిష్యుడు.

'నీ అభిప్రాయం త్వరలోనే మారుతుంది' అన్నాడు గురువు.

సంవత్సరం అయింది. 'యోగా అద్భుతంగా ఉంది. నేను సంపూర్ణ జ్ఞానవంతుణ్ణి అయ్యాను' అన్నాడట శిష్యుడు.

'నీ అభిప్రాయం త్వరలోనే మారుతుంది' అన్నాడు గురువు.

పిల్లల (తో) సమస్యలు

**పవన్, మెయిల్:**

**నాకు ఇద్దరు పిల్లలు. ఎనిమిదో తరగతి, ఆరో తరగతి చదువుతున్నారు. ఈ మధ్య వాళ్లిద్దరూ డబ్బులు దొంగిలించి బయట అవీ ఇవీ కొనుక్కుని తినడం చేస్తున్నారు. అలా దాదాపు ఎనిమిది వందలు ఖర్చు చేశారు. వాళ్లు స్కూలు నుంచి వచ్చేసరికి వాళ్ల కోసం ఫుడ్ రెడీగా ఉంచుతాం. అయినా ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదు. వాళ్లని మందలించాలా లేక డబ్బులు కంట పడకుండా దాచేయాలా? నేనిప్పుడు ఏం చేయాలి?**

ఎనిమిది వందలు దొంగతనం చేసేటంతగా వారు ఏమి తిన్నారు? తినటంకోసమే వారు దొంగతనం చేస్తున్నారని మీరెలా నిర్ధారణకి వచ్చారు. నెల రోజుల్లో ఎనిమిది వందలు ఖర్చు పెట్టారంటే స్నేహితులందరూ కలిసి తింటున్నారా? ముందు ఆ విషయం కనుక్కోవాలి. ఇది తిండికి సంబంధించిన వ్యవహారంలా అనిపించట్లేదు. డబ్బులు కనబడకుండా దాచేయటం దీనికి పరిష్కారం. వాళ్ళ దొంగతనం మీకు తెలిసింది అన్న విషయం వాళ్ళకి తెలిసేలా చేయాలి. కొట్టినా, తిట్టినా అది ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవచ్చు. సున్నితంగా వ్యవహరించి తెలుసుకోండి. తమ దొంగతనం విషయం మీకు తెలిసిందని గ్రహించిన తర్వాత కూడా వాళ్ళు అదే పని చేస్తూంటే, ఎవరైనా మనస్తత్వ శాస్త్ర నిపుణుడి దగ్గరకి తీసుకెళ్ళండి.

**రమణి, ధవిళేశ్వరం.**

**చిన్న పిల్లల్లో లెక్కల పట్ల ఉత్సాహం పెరగాలంటే ఏమి చెయ్యాలి?**

కుడి వైపు మెదడు పెరిగేలా చెయ్యాలి. సాయంత్రపు పూట, మరియు శలవు రోజుల్లో కూర్చోబెట్టి చిన్న చిన్న ప్రశ్నలు అడగాలి. మంచి సమాధానానికి బహుమతులు ఇవ్వాలి. అలాంటి ప్రశ్నల పుస్తకాలు మార్కెట్‌లో చాలా లభిస్తాయి. 'ఒక కంపెనీ వారు తమ చాక్లెట్ ప్రమోషన్ కోసమై, ఫలానా బ్రాండు చాక్లెట్ పై చుట్టిన రేపర్లు 5 ఇస్తే, ఒక చాక్లెట్ బహుమతిగా ఇస్తారు. ఒక కాలనీ కుర్రాళ్ళు తమ దగ్గర ఉన్న చాక్లెట్ రేపర్లు అన్ని కలిపి 77 పోగు చేసారు. వారికి ఎన్ని బహుమతిగా వస్తాయి? అని అడగండి. మీ వాళ్ళు 19 (15+3+1) అని కరెక్టుగా చెపితే, ఒక చాక్లెట్ బహుమతిగా ఇవ్వండి. ఇది ఇటీవలే రిలీజైన నా పుస్తకం "డెవలపింగ్ రైట్ బ్రెయిన్" అన్న పుస్తకం నుంచి ఒక ప్రశ్న (ఇది సేల్స్ ప్రమోషన్ కాదు. ఉదాహరణగా చెప్పానంతే ☺).

**సుమతి, రాజమండ్రి:**

**చాలామంది పిల్లలకి సంబంధించిన విషయాల్లో 'హైపర్-యాక్టివ్' అన్న పదాన్ని వాడుతున్నారు. దీని గురించి కాస్త వివరించగలరు.**

విపరీతమైన అల్లరీ, ఒక చోట కుదురుగా ఉండకపోవటం, చేతిలో వస్తువులు గిరాటు వేయటం, టీ.వీ. చానల్స్ తరచూ మారుస్తూ దేనితోనూ సంతృప్తి చెందకM పోవటం, ఆలోచించకుండా సమాధానం చెప్పటం, పరిణామం ఆలోచించకుండా పని చెయ్యటం మొదలైన




విశేషణాలని హైపర్ యాక్టివ్ అంటారు. అయితే హైపర్గా ఉండటం కన్నా, లేకపోవటం (ఆటిజం) భయపడ వలసిన పరిస్థితి. అలాంటి పిల్లలు మన్ను తిన్న పాముల్లా ఉంటారు. చిన్నపిల్లల్లో హైపర్-యాక్టివిటి మంచి లక్షణం. కొంత వయసు వచ్చాక (అంటే దాదాపు పన్నెండేళ్ళు దాటాక) నిబద్ధత, నమ్రత, నెమ్మది అలవాటవ్వాలి. అలా తగ్గని పిల్లల హైపర్-యాక్టివిటీ తగ్గించే కొన్ని పద్ధతులున్నాయి. చాలా వ్యక్తిత్వ వికాసపుస్తకాలలో వీటి గురించి చర్చ జరిగింది.

**విశ్వజీత్, విజయనగరం:**

**మా అబ్బాయికి పదేళ్ళు. వాడికి జనరల్ నాలెడ్జ్ పట్ల ఉత్సాహం పెంచాలంటే ఏమి చెయ్యాలో చెప్పండి.**

అర్థవంతంగా సాయంత్రం వాడితో ఒక గంట గడపండి. టి.వీలో తనతో కలిసి హిస్టరీ, నేషనల్ జియగ్రఫీలాంటి  చానల్స్ చూడండి. కొంత కాలానికి, పోగో కార్టూన్స్ కన్నా అవే బావున్నాయన్న భావాన్ని అలవాటు చేసుకుంటాడు. మిగతా పిల్లల కన్నా తాను డిఫరెంట్ అనే భావం అతడిలో ఏర్పడటం కోసం ఏమి చెయ్యాలో అదంతా చెయ్యండి.

జనరల్ నాలెడ్జి ఉత్సాహంగా ఉండేలా చెప్పండి. పజిల్స్ ఇవ్వండి. ఉదాహరణకి ఈ 6 వాక్యాలను సరైన క్రమంలో అర్థవంతంగా తయారుచేయమని అడగండి.1. ఇండియాలో ఏనుగులు, ఆఫ్రికా ఏనుగుల కంటే చిన్నవిగా ఉంటాయి 2. ఇండియా ఏనుగులు అడవులు ఎక్కువగా వుండే పరిసరాల్లో ఉండడానికి ఇష్టపడతాయి 3. వర్షాకాలం ప్రారంభంలో విశాలమైన ప్రాంగణ ప్రదేశాల్లో గడ్డి తినటానికి బయటకు వస్తాయి. 4. వర్షాలు పడే సమయంలో ఒక అడవి నుండి ఇంకో అడవిలోకి ఎప్పుడూ ఒకే వరుసలో సంచరిస్తాయి. 5. అవి సాధారణంగా దాదాపు మూడు మీటర్ల ఎత్తులో, మూడువేల కేజీల బరువుతో ఉంటాయి. 6. ఇంకోవైపు ఆఫ్రికా ఏనుగులు మూడున్నర కేజీల ఎత్తుతో ఆరువేల కేజీల బరువుతో ఉంటాయి.

ఆలీబాబా నలభై దొంగలు, డేవిడ్ అండ్ గోలియత్, సింద్‌బాద్ సాహసయాత్రల్లాంటి కథలు చిన్నపిల్లల్నే కాదు. టీనేజర్స్‌ని కూడా ఆకర్షిస్తాయి. Developing Right brain (The best gift to your child) అన్న పుస్తకంలో లేటరల్ థింకింగ్‌కి సంబంధించిన 400 ప్రశ్నలున్నాయి. ***పాత పుస్తకాలు ఎందుకు మంచి పరిమళంతో అదో రకమైన సువాసన వెదజల్లుతాయి? ఈ ప్రపంచంలో ఒక కన్ను ఉన్న జీవి ఏది? చంద్రమండలం మీద క్షవరం చేసుకోవటం ఎలా? సీతని కోల్పోయిన రాముడు దీపావళి రోజు రాత్రి ఎలా గడిపాడు? రైల్లో వెళ్తూ దాని వేగం కనుక్కోవటం సాధ్యమా? ముగిసిన తరువాత కూడా ఎవరు గెలిచారో ఆటగాళ్ళకి తెలియని ఆట ఏది? పచ్చిరొయ్యకి గుండె ఎక్కడుంటుంది (తలలో)...*** లాంటి ప్రశ్నలు అందులో చాలా ఉన్నాయి. సమాధానాలు ప్రయత్నించండి. సమస్యని పరిశీలించే నేర్పు, పరిష్కరించే విధానం, తర్కం, రీజనింగ్, కామన్ సెన్సు పెంపొందించుకోవటానికి ఆ ప్రశ్నలు ఉపయోగ పడతాయి. మళ్ళీ చెపుతున్నాను... ఇది సేల్స్ ప్రమోషన్ కాదు. పిల్లలకి ఇవన్నీ చెప్పాలన్న తపన.

**ఆకాష్. గుంటూర్.**

**మా క్లాసులో టీచరు, పదిహేడు గీతలు, రెండు సున్నాలతో ఒక చతురస్రం గీయమని చెప్పారు. ఇది మీ పుస్తకం లోదే అన్నారు. ఎలా?**

ఈ పాటికి ఆయన చెప్పే ఉంటారు. ఇది 'డెవలపింగ్ రైట్ బ్రెయిన్' అన్న పుస్తకం లోది. సల్మాన్ ఖాన్‌ని అతడి గర్ల్ ఫ్రెండ్ ఈ ప్రశ్న అడిగి చాలెంజ్ చేసి, అతను చెయ్యలేకపోతే... తాను చేసి చూపించి పెళ్ళి చేసుకుంటుంది. పదిహేడు గీతలు, రెండు సున్నాలతో ఒక చతురస్రం...



రేష్మ, వైజాగ్:

నేను డిగ్రీ ఫస్టియర్ చదువుకుంటున్నాను. మా ఊరు సిటీకి దూరం. అందుకే సిటీలోని మా మావయ్య వాళ్ల ఇంట్లో ఉంటూ చదువుకుంటున్నాను. మా అత్త వేరే ఊళ్లో స్కూల్ టీచర్. ఆమె స్కూల్ దగగ్గరే ఉండాలి. అందుకే ప్రతి ఆదివారం వచ్చి వెళుతూ ఉంటుంది. మా మావయ్య బ్యాంకు ఉద్యోగి. ఇంట్లో మావయ్య, ఒకటో తరగతి చదివే వాళ్ల బాబు, మా అత్త తమ్ముడు ఉంటారు. రోజూ నేను మావయయకి క్యారేజీ రెడీ చేసి, నేను రెడీ అయ్యి కాలేజీకి వెళ్లాలి. ఇంటి పనులకే ఎక్కువ సమయం కేటాయించాల్సి రావడంతో చదువు కుంటుపడింది. పరిస్థితి ఇలా ఉంటే, ప్రస్తుతం మా అత్త ప్రెగ్నెంట్..సిటీలోనే ఉండే మా అక్కవాళ్ల దగ్గరకు వెళ్లి ఉండాలనుకుంటున్నాను. ఈ పరిస్థితిలో నేను మావయ్య వాళ్ల ఇంటి నుంచి వెళ్లిపోతే పనులు చేయడానికి బద్ధకించి వెళ్ళిపోయాననుకుంటారు. ఇప్పుడు ఏం చేయాలో తోచడం లేదు. సరైన మార్గం సూచించగలరు.

అవసరం ఉన్నంత కాలం వాడుకుని, పని చెయ్యవలసి వచ్చినప్పుడు వెళ్ళిపోవటం బాధ్యత కాదు. మరోవైపు మీ చదువు మీకు ముఖ్యం.. మావయ్యకీ, బాబాయికీ వంట చేసిపెట్టటంలో తప్పు లేదనిపిస్తే ఉండండి. ఇద్దరు మగవాళ్ళు ఉన్న ఇంట్లో ఒంటరిగా ఉండటం బావోదనిపిస్తే వెళ్ళిపోండి. అంతే తప్ప "ఎవరేమి అనుకుంటారో" అన్న భావంతో మాత్రం ఉండొద్దు.

**(కొనసాగింపు వచ్చేనెల)**